## క్లుప్తంగా

### స్నేహితుడి కుటుంబానికి చేయూత



పాలకుర్తి: మండలంలోని ఈరవెన్ను గ్రామానికి చెందిన దామెర స్వామి ఇటీవల మృతి చెందాడు. దీంతో అతడితో కలిసి స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 2005–06 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. స్వామి కూతురు వైష్ణవి పేరు మీద రూ.65,000లను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈ మేరకు గురువారం దశదిన కర్మకు హాజరై డిపాజిట్ బాండ్ పేపర్‌ను, 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వామి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్వామి బాల్య స్నేహితులు పాల్గొన్నారు.

**స్నేహితురాలికి..**



పాలకుర్తి పట్టణ కేంద్రానికి చెందిన మారోజు శ్వేత తండ్రి ఆరేళ్ల క్రితం మృతి చెందాడు. నెల క్రితం భర్త గుండెపోటుతో మృతి చెందాడు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న శ్వేతకు ఆమెతో కలిసి చదువుకున్న తోటి స్నేహితులు కూతురు పేర పోస్టాఫీస్‌లో రూ.40వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి పాస్‌బుక్‌ను అందజేశారు. రాపాక అనిల్ కుమార్, గాదెపాక కిరణ్ కుమార్, ఆంజనేయులు, వడ్లకొండ కుమార్ తదితరులు ఉన్నారు.

### జీపీకి ఫ్రీజర్ బహూకరణ



రఘునాథపల్లి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్నేహితుడి జ్ఞాపకార్థం హైదరాబాద్‌కు చెందిన స్నేహితులు భానాజీపేట గ్రామ పంచాయతీకి ఫ్రీజర్‌ను అందజేసి ఔదార్యం చాటారు. భానాజీపేట గ్రామానికి చెందిన చాట్ల రాహుల్ ఇటీవల హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. కాగా, భానాజీపేటలో గురువారం జరిగిన దిశదిన కర్మకు మృతుడి స్నేహితులు కె రాజు, జయ ప్రశాంత్, కిషన్, అరవింద్, ఇసాక్, నవాబ్, శివకుమార్, సాయికుమార్, మోహిత్, భాస్కర్, గరిధర్, సిద్దార్థ్‌లు హాజరై స్నేహితుడి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్నేహితుడి జ్ఞాపకార్థం వారు గ్రామ పంచాయతీకి రూ.50వేల ఫ్రీజర్ (శవపేటిక) అందజేసి గ్రామస్తుల ప్రశంసలు అందుకున్నారు. ఎంపీటీసీ రచ్చ సోమనాథ్, మాజీ ఎంపీటీసీ పగిడిపల్లి కృష్ణ, కారోబార్ మల్లేశం, చాట్ల శ్రీనివాస్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక


సహస్రలక్ష్మి


రాహుల్


ఎం.సంయుక్త


ఐశ్వర్య


వంగ భవిత


మానస

చిల్పూరు: ఇటీవల నిర్వహించిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షల్లో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎలిశాల సహస్రలక్ష్మి, దామెర రాహుల్ ప్రతిభ చాటి ఎంపికైనట్లు హెచ్‌ఎం దాసి శ్రవణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల అభివృద్ధి దాత పెద్ది వెంకటనారాయణ గౌడ్, అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ చైర్మన్ రాధిక, ఎంపీపీ సరిత, నోడల్ అధికారి గోవర్ధన్, మాజీ సర్పంచ్ రాజ్‌కుమార్‌లు అభినందించారు.

**జనగామ నుంచి ముగ్గురు..**

జనగామ రూరల్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు జిల్లా కేంద్రంలోని ధర్మకంచ హైస్కూల్‌కు చెందిన ఒకరు, వడ్లకొండ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు ఎంపికైనట్లు హెచ్‌ఎంలు ఎ.శ్రీనివాస్, స్వర్గం ప్రకాష్ గురువారం తెలిపారు. ఎంపికై న విద్యార్థినులు మారబోయిన సంయుక్త, గొల్లపల్లి ఐశ్వర్య, వంగ భవితలకు ఇంటర్ వరకూ ప్రతీ సంవత్సరం రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందుతుందని తెలిపారు.

**పాలకుర్తి నుంచి ఒకరు..**

పాలకుర్తి టౌన్: ఎన్‌ఎంఎంఎస్‌కు పాలకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని దేశబోయిన మానస ఎంపికై నట్లు హెచ్‌ఎం పాయం శోభారాణి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్ ఓరుగంటి రమేష్ అభినందించారు.

# తప్పని తిప్పలు

- ఉపాధి కూలీలకు అందని డబ్బులు

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్లలో ఉపాధి కూలీలకు కూలి అందక నాలుగు నెలలుగా తిప్పలు పడుతున్నారు. గతేడాది నుంచి ఇదే విధమైన ఇబ్బందులు పడుతున్నా అధికార యంత్రాంగం చక్కదిద్దడంలో జాప్యం చేస్తోంది. దీంతో ఈ ఏడాది కూడా ఉపాధి కూలీలలకు తిప్పలు తప్పడంలేదు. పోస్టాఫీసుల్లో అకౌంట్లు తీసుకున్న ఉపాధి కూలీలకు గత జనవరి నుంచి డబ్బులు రావడం లేదు. గతంలో మాదిరిగా కాకుండా కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఉపాధి డబ్బులు జాబ్‌కార్డు దారుడి మస్టర్ ఆన్‌లైన్ చేయగానే వారం పది రోజుల్లో ఆ ఖాతాలో జమ అవుతున్నాయి. కానీ తీసుకునేందుకు నెల్లుట్ల పోస్టాఫీసు అకౌంట్లు అన్నీ జనగామ హెడ్ ఆఫీస్‌కు లింక్ కావడంతో మారిన సాఫ్ట్‌వేర్ విధానంతో స్థానిక బ్రాంచ్ పోస్టు ఆఫీసులో తీసుకొనేందుకు వీలు కావడంలేదు. అకౌంట్లు అన్నీ హెడ్ ఆఫీసులో మార్పింగ్ చేయాల్సి ఉంటుంది. అంటే ఖాతాదారుడి అకౌంట్, ఆధార్, ఫోన్ నంబర్లను తీసుకొని మార్పింగ్ చేస్తేకాని బ్రాంచ్ పోస్టాఫీసుల్లో తీసుకొనే అవకాశం ఉంటుంది. గతేడాది 8 నెలలుగా కూలీలకు డబ్బులు రాకపోవడంతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా జనగామ హెడ్ ఆఫీసులో కూలీలకు డబ్బులు చెల్లించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇదే పరిస్థితి కొనసాగుతోంది. దీంతో ఈ ఏడాది నాలుగు నెలలుగా కూలీలకు డబ్బులు రావడంలేదు. బ్రాంచ్ పోస్టు మాస్టర్ నర్సయ్యను ప్రశ్నిస్తే తమ చేతుల్లో లేదని, అంతా హెడ్ ఆఫీసు అకౌంట్‌లలో జమ కావడంతో ఇబ్బంది కలుగుతోందని, అకౌంట్లన్నీ మార్పింగ్ చేస్తే కాని బ్రాంచ్‌లో తీసుకొనే వీలు ఉంటుందని అంటున్నారు. ఇప్పుడిప్పుడే ఆ పనులు సాగుతున్నాయని, వారం పది రోజుల్లో సమస్య పరిష్కారం అవుతోందని వివరించారు. ఇదిలా ఉండగా లింగాలఘణపురం, కళ్లెం పోస్టాఫీసుల పరిధిలోని గ్రామాలు బండ్లగూడెం, నాగారం గ్రామస్తులు లింగాలఘణపురం, కళ్లెం పోస్టాఫీసు పరిధిలోని మంథోనిగూడెం, చిక్కులోనిగూడెం, మాణిక్యాపురం గ్రామస్తులు కళ్లెంకు వచ్చి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.



నెల్లుట్లలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

### నాలుగు నెలలుగా పైసలొస్తలేవు..



నాలుగు నెలలుగా కరువు పని పైసలొస్తలేవు. పోస్టాఫీసుకు వెళ్తే అక్కడ రాలేదని అంటున్నారు. తిరిగితిరిగి వస్తున్నాం. ఎండలో పనులు చేసి మళ్లీ డబ్బులు తీసుకొనేందుకు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సార్లు కొంచెం దృష్టి పెట్టి త్వరగా వచ్చే విధంగా చూడాలి.

**- నల్ల అంజమ్మ, నెల్లుట్ల**

## నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ



ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న పోలీసులు

నర్మెట: నాణ్యమైన విత్తనాలనే రైతులు కొనుగోలు చేయాలని ఏఈఓ కన్నయ్య అన్నారు. వెల్దండలో గురువారం ఉపాధిహామీ పనిప్రదేశాల వద్ద రైతులకు సాగు విత్తనాలపై అవగాహన కల్పించిన ఆయన మాట్లాడారు. విడివిత్తనాలు, కాలం చెల్లిన ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు కొనుగోలు చేయరాదని, దుకాణం నుంచి కొనుగోలు రశీదులను తప్పనిసరి తీసుకోవాలన్నారు. పంటకాలం ముగిసేవరకు విత్తనాల ప్యాకెట్, రశీదును భద్రపరిచి ఉంచాలని వ్యవసాయశాఖ గుర్తింపు పొందిన దుకాణాలలోనే కొనుగొనుగోళ్లు చేయాలని సూచించారు. దుకాణదారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

**విత్తనాలు బ్లాక్ చేస్తే చర్యలు తప్పవు**

నకిలీ విత్తనాలు, బీటీ– 3 (హెచ్‌టి పత్తి) విత్తనాలు విక్రయించినా, బ్లాక్ మార్కెట్ చేసినా కఠిన చర్యలు తప్పవని సీఐ మినుకూరి సాయిరమణ, వ్యవసాయాధికారి ధరావత్ సంతోషిని అన్నారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను గురువారం తనిఖీ చేసిన వారు షాపు యజమానులకు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో ఎస్సై కన్నెబోయిన శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జయప్రదం చేయండి



స్టేషన్‌ఘన్‌పూర్: హనుమాన్ జయంతి సందర్భంగా జూన్ 1వ తేదీన స్థానిక హనుమాన్ భక్తమండలి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని భక్త మండలి బాధ్యులు గోనెల ఎల్లయ్య, కొలిపాక ఐలోని, పెసరు సారయ్య కోరారు. స్థానిక హనుమాన్ దేవాలయం వద్ద గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. హనుమాన్ జయంతి సందర్భంగా స్థానిక రిజర్వాయర్ కట్ట వద్ద ఉన్న హనుమాన్ గుడి వద్ద భక్తమండలి ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. హనుమాన్ భక్తులు గోనెల రాజేందర్, మొగ్దుంపురం కిషోర్‌కుమార్, ఇల్లందుల ప్రసాద్, గోనెల శివకృష్ణ, పొన్నం రాజయ్య, ముప్పిడి లింగం, పాండు రాజు, సాంబరాజు, లింగం పాల్గొన్నారు.

## నివాళి



పాలకుర్తి టౌన్: పాలకుర్తికి చెందిన కమ్యూనిస్టు నాయకుడు మామిండ్ల ఎల్లయ్య (75) గురువారం మృతి చెందాడు. కాగా, పలు పార్టీల నాయకులు ఆయన మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య కుమారుడు సీపీఐఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేశ్‌రాజాను వారు పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. నాయకులు రొయ్యల రాజు, మారుపల్లి మల్లేశ్, శ్రీనివాస్, రజిత, జీడి సోమన్న, గంగు కృష్ణమూర్తి, భైరు భార్గవ్, చిట్యాల రాంచంద్రం, దుంపలి సంపత్, పబ్బ సంతోష్, మామిండ్ల సోమయ్య, మామిండ్ల యాకయ్య తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర చిహ్నంలో మార్పు చేస్తే ఉద్యమం తప్పదు

స్టేషన్‌ఘన్‌పూర్: కాకతీయుల అస్తిత్వాన్ని, ఓరుగల్లు ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రభుత్వం రాష్ట్ర చిహ్నంలో మార్పు చేస్తే రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం తప్పదని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదె పృథ్వీ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రజావ్యతిరేక పాలనకు తెరలేపిందన్నారు. రాష్ట్ర చిహ్నంలో కాకతీయ తోరణం మార్పు ఏమాత్రం సరైన నిర్ణయం కాదని, ఓరుగల్లు కేంద్రంగా మరో ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు.

**కాకతీయ కళాతోరణాన్ని తొలగించాలనుకోవడం సరికాదు**

జఫర్‌గఢ్: రాజముద్ర నుంచి కాకతీయ కళాతోరణాన్ని తొలగించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచన చేయడం ఏమాత్రం సరికాదని బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఓరుగల్లు కేంద్రంగా పాలించిన కాకతీయులకు ఎంతో ఘన చరిత్ర ఉందన్నారు. అలాంటి కాకతీయులకు సంబంధించిన కళాతోరణాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తొలగించేందుకు ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి నిర్ణయాల వల్ల ప్రజల నుంచి ప్రభుత్వానికి తీవ్రమైన వ్యతిరేకత ఎదురుకాక తప్పదన్నారు.

**కేసీఆర్ పాలనకు తీసిపోని రేవంత్‌రెడ్డి ప్రజాపాలన**

దేవరుప్పుల: కేసీఆర్ రాచరికపు పాలనకు తీసిపోని విధంగా ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన కొనసాగుతుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ రాజశేఖర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూపొందించిన ప్రభుత్వ రాజముద్ర నుంచి కాకతీయ కళాతోరణం తొలగించాలి అనే ఆలోచనను చూస్తే రాజుల పాలనలో తమదైన ముద్ర ఉండేలా చూస్తున్నట్లు వెల్లడవుతుందన్నారు. రాజముద్ర నుంచి కాకతీయ తోరణం తొలగింపుతో అప్పటి పాలకులను అవమానించడమేనని అభివర్ణించారు. రాజకీయాలకతీతంగా తెలంగాణ మేధావులు జోక్యం చేసుకొని ఐక్యసంఘటనతో రాజముద్ర మార్పుపై స్పందించాలని కోరారు.

## సంక్షిప్త సమాచారం

**తాగునీటికి ఇబ్బంది రాకుండా చూడాలి**



బచ్చన్నపేట: మండలంలోని పలు గ్రామాల్లో వేసవి దృష్ట్యా తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలని పీఆర్ ఏఈ, పలు గ్రామాల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం మండలంలోని కట్కూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ బోరుబావికి నూతన మోటరును బిగించి మాట్లాడారు. జీపీ కార్యదర్శి ప్రశాంత్ ఆచార్య, కారోబార్ రాజు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

**క్రీడాకారులకు టీషర్టుల పంపిణీ**



పాలకుర్తి టౌన్: డీవైఎస్‌ఓ ఆధ్వర్యంలో చెన్నూరు గ్రామంలో నిర్వహించిన సాఫ్ట్ బాల్, వాలీబాల్ శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా 100 మంది క్రీడాకారులకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు మొలుగూరి యాకయ్య టీషర్టులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారి వెంకటరెడ్డి, నోముల సతీష్, ఆకారపు ఉపేందర్, బాలబోయిన నరేష్, రవి, సంతోష్, వెంకన్న, ఎల్లయ్య, మొలుగూరి వెంకన్న పాల్గొన్నారు.

**పరామర్శ**

నర్మెట: ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు ఇటీవల ప్రమాదానికి గురై చికిత్స అనంతరం కోలుకుంటున్నారు. కాగా, స్వగ్రామమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా చీరాలలోని ఆయన స్వగృహంలో ఎమ్మెస్పీ జనగామ జిల్లా అధ్యక్షుడు గద్దల కిషోర్, అధికార ప్రతినిధి సందెన కుమార్, జిల్లా నాయకులు గువ్వల రవి, ఆరూరి శ్రీనివాస్, కట్ల ప్రశాంత్ గురువారం పరామర్శించారు.

**సీతారాంపురంలో..**

దేవరుప్పుల: మండలంలోని సీతారాంపురానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు వన్నెకాల అంజయ్య మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరాములు పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు రతన్‌జీ, దామెర అనిల్, మాజీ సర్పంచ్ రెడ్డి రాజుల రమేష్, బీసీ సెల్ అధ్యక్షుడు గణేష్, బోనగిరి యాకస్వామి, సిద్దులు, నిమ్మల గణేష్,చరణ్,ప్రదీప్ సాత్విక్, అశోక్, మహేష్ తదితరులు ఉన్నారు.

**బైండోవర్**

లింగాలఘణపురం: మండల కేంద్రంలో గురువారం ఇద్దరు హనుమాన్ మాలధారులు చందాల కోసం తిరుగుతూ అనుమానాస్పదంగా కనిపించడంతో గ్రామస్తులు పోలీసులకు అప్పగించగా ఎస్సై చింత రాజు వారిని తహసీల్దార్ వినయలత ముందు బైండోవర్ చేశారు. ఇటీవల గ్రామంలో ఇద్దరు హనుమాన్ మాలధారులు వచ్చి ఓ వ్యక్తికి మోసపూరిత మాటలు చెప్పి అతని వద్ద రూ.7వేలు తీసుకెళ్లినట్లు తెలిసింది. అదేవిధంగా మళ్లీ హనుమాన్ మాలధారణతో వచ్చిన ఇద్దరు వ్యక్తులు అదే పనిగా వచ్చారని భావించి పోలీసులకు అప్పగించగా వారికి కౌన్సిలింగ్ ఇచ్చి బైండోవర్ చేశారు.

**సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి**



జనగామ రూరల్: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాపర్తి రాజు అన్నారు. గురువారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయలంలో జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. నాయకులు విజేందర్, ఆనంధం, ప్రశాంత్, మల్లేష్, ఉపేందర్, శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

## వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

రఘునాథపల్లి: మండలంలోని కోమల్లలో వేణుగోపాలస్వామి అధ్యయన బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయం వద్ద రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆనవాయితీ ప్రకారం పద్మశాలీ కులస్తులు మంగళవాయిద్యాలతో ఉత్సవ మూర్తులను పల్లకిలో ఆలయం ముందుకు మోసారు. ధర్మకర్త ఉత్తలూరు అనిల్‌బాబు, వేద పండితులు యజ్ఞాచార్యదరిపల్లి లక్ష్మణాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణతంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల వరలక్ష్మి, గ్రామ పెద్దలు పానుగంటి గోపాల్‌కిషన్ రావు, సుల్తాన్ నర్సింహారెడ్డి, తాటికొండ వెంకటేష్‌యాదవ్, బొల్లపల్లి కుమారస్వామి, వల్లాల అశోక్, ఉపేందర్, అవదూత శ్రీనివాస్, పెంట గట్టు మల్లు, సుమన్, వేద పండితులు దరిపల్లి సురేశాచార్య, ఉత్తలూరు గోపాలచార్యులు, ఉత్తలూరి కృష్ణ కౌశిక్, సముద్రాల లక్ష్మీనర్సింహచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ మాలధారుల యజ్ఞం



కొన్నెలో యజ్ఞం చేస్తున్న హనుమాన్ భక్తులు



ఇరుముడితో బయలుదేరిన మాలధారులు

బచ్చన్నపేట: మండలంలోని పలు గ్రామాల్లో హనుమాన్ మాలాధారులు గురువారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు, యజ్ఞాలు నిర్వహించారు. మాల విరమణకు రెండు రోజులు ఉండడంతో పలు దేవాలయాలకు వెళ్లే హనుమాన్ భక్తులు హోమాలు, యజ్ఞాలను నిర్వహించి ఇరుముడి కట్టుకొని బయలుదేరారు. అలాగే నగరసంకీర్తన చేపట్టారు. ఈ సందర్భంగా దాతలు స్వాములకు అన్నదానం నిర్వహించారు.

**భద్రాచలానికి హనుమాన్ మాలధారులు**

రఘునాథపల్లి: మండలంలోని ఇబ్రహీంపూర్ శివాలయంలో గురువారం హనుమాన్ మాలధారులు వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు చేసి ఇరుముడి కట్టుకున్నారు. ఇరుముడి ధరించిన భక్తులు రామ భజనలతో ప్రత్యేక వాహనంలో భద్రాచలానికి బయలు దేరారు. భద్రాచలం వెళ్లిన వారిలో హనుమాన్ మాలధారులు నూనె మల్లేష్, దొరగొల్ల మహేష్, బాషపెల్లి హెమేందర్, శివార్ల కుమార్, సింగారపు లక్ష్మణ్, కొండ ఉదయ్, పండుగ శేఖర్, పండుగ అంజనేయులు, శివార్ల రాజు, ల్యాగల అనిల్, దొరగొల్ల రాములు తదితరులు ఉన్నారు.

## పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రఘురామకృష్ణ

బచ్చన్నపేట: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. మండలంలోని తమ్మడపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. అలాగే పల్లె ప్రకృతి వనం, ఈజీఎస్ పనులను పరిశీలించి మాట్లాడారు. పనులను నాణ్యతతో చేయాలని అప్పుడే వంద శాతం బిల్లులు అందుతాయన్నారు. పంచాయతీ కార్యదర్శి సౌజన్య, కారోబార్ నాగయ్య పాల్గొన్నారు.

## 'రాజకీయ ఉనికి కోసమే బీఆర్‌ఎస్ ఆరాటం'



మాట్లాడుతున్న శ్రీరాములు

దేవరుప్పుల: అధికారాన్ని కోల్పోయిన బీఆర్‌ఎస్ రాజకీయ ఉనికి కోసం అభూతకల్పనలతో అర్థరహిత ఆరోపణలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు విమర్శించారు. గురువారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలోనే అభివృద్ధి మాటున కోలుకొండ నుంచి గొల్లపల్లి వరకూ విచ్చలవిడిగా ఇసుక తరలించారని ఆరోపించారు. రిజర్వాయర్లకు ఇసుక తరలించేందుకు ఉత్తర్వులు జారీ చేస్తే ప్రతిపక్షాల ప్రతిఘటనతో వెనక్కి తగ్గారన్నారు. ఇలాంటి తరుణంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం స్థానిక అవసరాల కోసం ఇసుక వినియోగించుకోవచ్చన్న అనుమతుల మేరకు జిల్లా కలెక్టర్ ఇసుక అనుమతులు ఇస్తే సోషల్ మీడియాలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిపైకి ఆపాదించడం హాస్యాస్పదమన్నారు. అర్థరహిత విమర్శలతో కాంగ్రెస్‌ను అభాసుపాలు చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ కాసారపు ధర్మారెడ్డి, సీనియర్ నాయకులు ఓడపల్లి రవీందర్, వంగ దశరథ, ఉప్పుల ఉప్పలయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు గణేష్, దామెర అనిల్, సంపత్, టి పాండు కృష్ణ, బోనగిరి యాకస్వామి తదితరులు పాల్గొన్నారు.

# అద్దె భవనాలు.. అరకొర వసతులు

- స్థల పరిశీలనతోనే సరిపెడుతున్న వైనం
- ఇరుకు గదుల్లో రికార్డుల భద్రత, విధులు నిర్వహణ



చిన్న గదిలో కొనసాగుతున్న తరిగొప్పుల మండల పరిషత్ కార్యాలయం

తరిగొప్పుల: పరిపాలన సౌలభ్యం, ప్రజలకు అందుబాటులో అధికారుల ఉండేందుకు తెలంగాణ ప్రభుత్వం జిల్లాల పునర్విభజనతోపాటు, కొత్త మండలాల ఏర్పాటు చేసింది. అంతా భాగానే ఉన్నా.. నూతనంగా ఏర్పడిన మండలాల్లో ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించడంలో ప్రభుత్వం చొరవ చూపడం లేదు. తరిగొప్పుల మండలం ఏర్పడి ఏళ్లు గడిచిన ప్రభుత్వ కార్యాలయాలు ఇప్పటికీ అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, మండల పరిషత్ కార్యాలయాల సిబ్బంది అరకొర వసతుల మధ్య విధులు నిర్వర్తిస్తున్నారు. ఇరుకు గదుల్లోనే రికార్డుల భద్రపరచడం, సిబ్బంది విధులు నిర్వర్తించడం తలనొప్పిగా మారింది. అద్దె భవనాల్లోనే కార్యాలయాలు నిర్వహిస్తుండడంతో ఇటు సిబ్బంది, అటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సొంత భవనాలు లేకపోవడంతో సమావేశాలు సైతం రైతు వేదికలో నిర్వహిస్తున్నారు. భవనాలకు నెలకు వేలాది రూపాయలు అద్దె చెల్లిస్తూ ప్రజా ధనాన్ని వృథా చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. సొంత భవనాల నిర్మాణం కోసం గతంలో రెండు, మూడుసార్లు స్థల పరిశీలన చేసినా ఇప్పటికి కార్యరూపం దాల్చడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. వివిధ అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం కార్యాలయాల సొంత భవనాల కోసం మీనమేషాలు లెక్కించడం శోచనీయమంటున్నారు. ఇప్పటికై నా అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

**ఒకే చోట కార్యాలయాలు నిర్మించాలి..**



మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోట ఉండేలా సమీకృత కార్యాలయం నిర్మించాలి. సొంత భవనాలు లేకపోవడంతో కార్యాలయాలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. త్వరగా సంబంధిత అధికారులు మండలకేంద్రంలో ప్రభుత్వ స్థలం గుర్తించి ప్రభుత్వ కార్యాయాల భవనాలు నిర్మించేందుకు దృష్టిసారించాలి.

**- భూక్య చందునాయక్, సీపీఎం నాయకుడు**

## బీఓబీ బ్రాంచ్‌ని జఫర్‌గఢ్‌కు తరలించాలి



జఫర్‌గఢ్: బ్యాంక్ అఫ్ బరోడా బ్రాంచ్‌ను జఫర్‌గఢ్‌కు తరలించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. ఈ మేరకు ఆయన హైదరాబాద్‌లో బ్యాంక్ అఫ్ బరోడా జోనల్ మేనేజర్ రితీష్‌కుమార్‌కు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ జఫర్‌గఢ్‌కు సంబంధించి బ్యాంక్ అఫ్ బరోడా గత కొన్నేళ్లుగా స్టేషన్‌ఘన్‌పూర్‌లో కొనసాగుతుండటంతో ఖాతాదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఖాతాదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని జఫర్‌గఢ్‌లో బ్రాంచ్ ఏర్పాటుకు కావల్సిన మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కృషి చేస్తామని వారికి హామీ ఇవ్వడం జరిగిందన్నారు.